
ప్రజాశక్తి
బుధవారం 30 ఏప్రిల్ 2025
5
విజయనగరం



ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ కళాశాలల జిల్లా కన్వీనర్ టి.వి.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 3 ప్రభుత్వ, 25 ప్రయివేటు ఐటిఐలలో మొదటి విడత ప్రవేశానికి iti.ap.gov.in వెబ్‌సైట్‌లో మే 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ అనంతరం వచ్చిన యునిక్యూ నంబర్‌తో మే 26వ తేదిలోగా సమీపంలోని ప్రభుత్వ ఐటిఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెళ్లి పరిశీలన పూర్తిచేసుకోవాలని కోరారు. పరిశీలన పూర్తిచేయకుంటే వారికి జాబితాలో ర్యాంకు కేటాయించరని తెలిపారు. అభ్యర్థులు ఏ జిల్లాలో అయినా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వెల్డర్, ప్లంబర్‌కు 8వ తరగతి పాసైన అభ్యర్థులు, మిగతా అన్ని ట్రేడ్లకు పదో తరగతి పాసైన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9849118075, 9849944654 నంబర్లను సంప్రదించాలని సూచించారు.



అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తిన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే బేబినాయన

బొబ్బిలి పీఠం.. టిడిపి పరం

- చైర్మన్‌పై అవిశ్వాసానికి అనుకూలంగా 21, వ్యతిరేకంగా 10 ఓట్లు
- టిడిపి ఖాతాలో చేరిన మున్సిపాలిటీ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 ఓట్లు, వ్యతిరేకంగా 10 ఓట్లు పడ్డాయి. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్లో మంగళవారం అవిశ్వాస తీర్మానంపై ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి రామ్మోహనరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే బేబినాయన ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు.

సమావేశంలో అవిశ్వాస తీర్మానాన్ని ఎన్నికల అధికారి రామ్మోహనరావు ప్రవేశపెట్టారు. చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేసే వారు చేతులు ఎత్తాలని ఆయన కోరారు. 10 మంది టిడిపి కౌన్సిలర్లు, 10 మంది వైసిపి అసమ్మతి కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు బేబినాయన చేతులెత్తి మద్దతు తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణకు అనుకూలంగా ఉన్నవారు చేతులు ఎత్తాలని కోరగా, 10 మంది వైసిపి కౌన్సిలర్లు చేతులెత్తారు. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది, వ్యతిరేకంగా 10 మంది ఓట్లు వేయడంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి రామ్మోహనరావు ప్రకటించారు. ఓటింగ్ పూర్తయిన వెంటనే చైర్మన్‌తో సహా 10 మంది వైసిపి కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు.

వైసిపి కౌన్సిలర్, ఎన్నికల అధికారి మధ్య వాగ్వివాదం

మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో వైసిపి కౌన్సిలర్ చోడిగంజి రమేష్ నాయుడు, ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి రామ్మోహనరావు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టిన సమయంలో కౌన్సిల్లో టిడిపి, వైసిపి కౌన్సిలర్ల బలాన్ని చెప్పాలని రమేష్‌నాయుడు కోరారు. దీనికి ఎన్నికల అధికారి అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్టీల బలం తాము చెప్పబోమని, నిబంధనల మేరకు సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, సహకరించాలని ఎన్నికల అధికారి కోరారు.

పటిష్ట బందోబస్తు

మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణపై నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద డిఎస్‌పి భవ్యరెడ్డి, పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

మున్సిపాలిటీకి పట్టిన గ్రహణం వీడింది : బేబినాయన

నాలుగేళ్ల నుంచి బొబ్బిలి మున్సిపాలిటీకి పట్టిన గ్రహణం వీడిందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. నాలుగేళ్ల నుంచి మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడటంతో సొంత పార్టీ కౌన్సిలర్లు అసంతృప్తి చెంది అవిశ్వాసం పెట్టారన్నారు. కౌన్సిలర్లను ప్రలోభ పెట్టి అవిశ్వాసం పెట్టినట్లు వైసిపికి చెందిన ఒక పెద్దమనిషి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. మున్సిపల్ చైర్మన్‌పై అసంతృప్తితోనే 10 మంది వైసిపి కౌన్సిలర్లు టిడిపికి మద్దతు ఇచ్చారని చెప్పారు. బొబ్బిలిలో రాజకీయ వ్యభిచారం జరుగుతుందని ఆరోపించిన పెద్దమనిషి.. 2009లో టిడిపి టికెట్ తెంటు లక్ష్మునాయుడుకు అధిష్టానం ఇస్తే అదే పార్టీలో ఉంటూ ఆయన్ను ఓడించేందుకు మీరు పని చేయలేదా? అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్మన్ పదవి టిడిపికి రావడంతో మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి కలిసికట్టుగా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని కౌన్సిలర్లను కోరారు.


బొబ్బిలిలో ప్రజాస్వామ్యం ఖూనీ : శంబంగి

బొబ్బిలి మున్సిపాలిటీలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు వ్యాఖ్యానించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల మద్దతుతో మున్సిపాలిటీని వైసిపి కైవసం చేసుకుంటే, టిడిపి అడ్డదారిలో కౌన్సిలర్లను ప్రలోభాలకు గురి చేసి అవిశ్వాస తీర్మానంతో మున్సిపల్ చైర్మన్ పదవిని లాక్కోవడం సరికాదన్నారు. విప్ జారీ చేసినప్పటికీ వైసిపి కౌన్సిలర్లు టిడిపికి మద్దతు ఇచ్చారని తెలిపారు. వారి పదవులు రద్దయ్యేలా న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో రాజులు రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చోడిగంజి రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాల్ పాల్గొన్నారు.

మారిక గ్రామాన్ని

అదానీకి అప్పగించొద్దు

కలెక్టర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని వినతి



కలెక్టర్‌కు వినతి అందిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని, నాయకులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జల విద్యుత్తు కోసం అదానీ గ్రీన్ ఎనర్జీ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థకు వేపాడ మండలం మారిక గ్రామాన్ని, కొండను అప్పగించొద్దంటూ సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ.. జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. విద్యుత్తు ప్రాజెక్టు కోసం ప్రభుత్వం గుర్తించిన ఆ పాంతంలో సుమారు 150 ఆదివాసీ గిరిజన కుటుంబాలు ఉన్నాయని, వారంతా అక్కడి అటవీ ఉత్పత్తులపై ఆధారపడుతూ జీవిస్తున్నారని తెలిపారు. వారి జీవన శైలి, ఆహారపు అలవాట్లు కారణంగా ఇతర ప్రాంతాల్లో వారు జీవనం సాగించే పరిస్థితి లేదన్నారు. ప్రాజెక్టు కోసం ఇక్కడ భూసేకరణ కోసం ఆలోచన చేయనున్నట్టు ప్రకటన వెలువడటంతో గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, ఇప్పటికే తమ పార్టీ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని, ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు.

సిపిఎం నాయకుల వినతిపై కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ అక్కడి పరిస్థితులను పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తామని, ఆ తరువాతే ముందుకు సాగుతామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ రాకోటి ఆనంద్ ఉన్నారు.

రూ.20 లక్షల పన్ను చెల్లింపు

విజయనగరం టౌన్ : పన్ను వసూళ్లకు నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య చేస్తున్న కృషి ఫలితాలనిస్తోంది. పెద్ద మొత్తంలో పన్నులు కూడా వసూలవుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మొత్తం పన్నును ఒకేసారి చెల్లించిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ఐదు శాతం రిబేట్ సౌకర్యాన్ని కల్పించిన విషయం విదితమే. అయితే ఈ అవకాశాన్ని వినియోగించుకున్న పూసపాటి అలక్ నారాయణ గజపతిరాజు, పూసపాటి మోనిషా గజపతిరాజు, పూసపాటి మాధురి గజపతిరాజు, వి.సుదానిదేవి... పూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న పది ఎకరాల ఖాళీ స్థలానికి పన్ను మొత్తం రూ.20 లక్షలు చెల్లించారు. అందుకు సంబంధించిన చెక్కులను వారి తరపున వ్యక్తులు మంగళవారం కమిషనర్ పల్లి నల్లనయ్యకు అందజేశారు.



అర్జీదారుల పత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

పిజిఆర్‌ఎస్‌పై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ అంబేద్కర్ ● నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం

వివిధ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)కు అందే ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు సంతృప్తి చెందే విధంగా ఈ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత గడువులోగానే సమస్యలకు పరిష్కారం చూపించాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, మంత్రుల కార్యాలయాలకు జిల్లా నుంచి అందిన దరఖాస్తులపై కలెక్టర్ తమ కార్యాలయంలో మంగళవారం సుదీర్ఘంగా సమీక్షించారు. మొత్తం 10 వినతులను ఈ సందర్భంగా పరిశీలించారు. ఫిర్యాదుదారులను తమ ఛాంబర్‌కు రప్పించి, వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వారి వద్దనున్న పత్రాలను పరిశీలించారు.

ఆ ఫిర్యాదులకు సంబంధించి రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు ఇప్పటివరకు తీసుకున్న చర్యలను ఆరాతీశారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులపై ఈ సందర్భంగా కలెక్టర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి అక్కడికక్కడే పలు ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కెఆర్‌ఆర్‌సి డిప్యూటీ కలెక్టర్ మురళి, డ్వామా పీడీ శారదాదేవి, సహకార అధికారి రమేష్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎడి ఆశయ్య, ఆర్‌డిఒ కీర్తి, తహశీల్దార్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్రంలోనే అతిపెద్ద లే అవుట్లలో ఒకటిగా చెప్పకుంటున్న గుంకలాం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం మంజూరుచేసిన సాయం సరిపోకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్పకోవచ్చు. ప్రభుత్వమే ఇళ్లు కట్టించి అప్పగిస్తుందన్న మూడో ఆప్షన్‌లో సంబంధిత కాంట్రాక్టర్ పనులు మధ్యలో నిలిపివేయడం కూడా మరో కారణంగా చెప్పకోవచ్చు. కారణం ఏదైనా... కారకులెవరైనా... ఒక మినీ టౌన్‌షిప్ మాదిరిగా మారబోతుందనుకున్న ఈ కాలనీ నిర్మాణాలు.. నేడు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.



పునాదుల స్థాయిలో నిలిచిన ఇళ్లు

మంజూరు 10 వేలు.. పూర్తయినవి 500

- గుంకలాం లేఅవుట్‌లో నత్తనడకన ఇళ్ల నిర్మాణం
- ప్రభుత్వ సాయం సరిపోకపోవడమే కారణం
- 2045 ఇళ్లను రద్దుచేసిన ప్రభుత్వం

గత వైసిపి ప్రభుత్వ హయాంలో జిల్లా వ్యాప్తంగా 81,999 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో 46,802 ఇళ్ల నిర్మాణాలు ప్రభుత్వం ఏర్పాటుచేసిన లేఅవుట్లలోనే చేపట్టారు. ఇందులో భాగంగా విజయనగర వాసులకు ఇదే మండలం గుంకలాం రెవెన్యూ పరిధిలో ఏర్పాటుచేసిన జగనన్న లేఅవుట్‌లో సుమారు 11వేల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఇందులో 10,139 మంది లబ్ధిదారులకు ఇళ్లను కూడా మంజూరు చేసింది. వీరిలో ఇప్పటి వరకు కేవలం 543 మంది మాత్రమే ఇళ్లను నిర్మించుకున్నారు. పునాదుల కింది స్థాయిలోనే 4,918, పునాదుల స్థాయిలో 1,650, గోడల స్థాయిలో 377, స్లాబ్ లెవెల్‌లో 606 ఇళ్లు ఉన్నాయి. మిగిలిన 2045 ఇళ్ల ఇప్పటికీ ప్రారంభించకపోవడంతో కూటమి ప్రభుత్వం తాజాగా రద్దుచేసింది.

గ్రౌండింగ్ అయిన ఇళ్లను మూడు పద్ధతుల్లో నిర్మాణాలు మొదలుపెట్టారు. సొంతంగా ఇళ్లు నిర్మించుకోవడం ఒకటో పద్ధతి. సొంతంగా కట్టుకున్నప్పటికీ ఇందుకు అవసరమైన మెటీరియల్ ప్రభుత్వమే అందించేది రెండో పద్ధతి. ఈ రెండు పద్ధతుల్లో 5,230 ఇళ్లను మంజూరు చేశారు. మూడో పద్ధతి ప్రకారం ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి, సున్నాలు, ముగ్గులు వేసి లబ్ధిదారులందరికీ తాళాలు కూడా అందజేస్తామని చెప్పారు. సగానికి ఎక్కువ మంది, అంటే 5,761 మంది లబ్ధిదారులు మూడో పద్ధతినే ఎంచుకున్నారు. ఇందుకు కారణం లేకపోలేదు. ప్రభుత్వం కేవలం రూ.1.80 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. పెరిగిన గృహ నిర్మాణ సామగ్రి, మేస్త్రీలు, కూలీల వేతనాలు బట్టి సర్కారు సాయం ఏమాత్రమూ సరిపోయే పరిస్థితి లేదు. దీంతో ఎక్కువ మంది ప్రభుత్వంపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మధ్యలో వదిలేసిన రాక్రిడ్ నిర్మాణ సంస్థ

ప్రభుత్వం తరపున చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను నాలుగు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించింది. మొత్తం 5,761లో అత్యధికంగా 5,097 ఇళ్లను రాష్ట్రంలోని రాప్తాడు మాజీ ఎమ్మెల్యేకు చెందిన రాక్రిడ్ అనే నిర్మాణ సంస్థ కాంట్రాక్టుకు తీసుకుంది. సుమారు రూ.25 కోట్లు గుంజుకున్న ఆ సంస్థ నవగ్రహాల్లా తొమ్మిది ఇళ్లను మాత్రమే పూర్తి చేసింది. 532 ఇళ్లు స్లాబు వరకు, 240 ఇళ్లు గోడల వరకు వచ్చాయి. పునాదుల స్థాయిలో 512లో నిలిచిపోగా, పునాదుల కన్నా దిగువ స్థాయిలో 4,416 ఇళ్లు వరకు ఉండిపోయాయి. లేబర్ దొరకడం లేదన్న సాకుతో ఆ నిర్మాణ సంస్థ పనులు అర్ధాంతరంగా నిలిపివేసింది. చేసిన పనికి సుమారు రూ.25 కోట్లు మాత్రం ప్రభుత్వం నుంచి వసూలు చేసుకుంది. ప్రభుత్వం మారాక విజిలెన్స్ విచారణ మొదలు పెట్టడంతో పనులు పడకేశాయి. దీంతో లబ్ధిదారులంతా అయోమయంలో ఉన్నారు.

త్వరలో కొత్త కాంట్రాక్టు



గుంకలాం లేఅవుట్ పరిధిలో మూడో పద్ధతిలో చేపట్టిన ఇళ్లు మధ్యాంతరంగా నిలిచిపోయిన విషయం వాస్తవమే. కానీ, ప్రభుత్వం ఆ ఇళ్ల నిర్మాణాలన్నీ పూర్తిచేసేందుకు కొత్త నిర్మాణ సంస్థతో కాంట్రాక్టు కుదుర్చుకునేందుకు కసరత్తు చేస్తోంది. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే నిర్మాణాలు పున:ప్రారంభమయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఈ రకమైన సమాచారం మాకు ఉంది. అంతే కాదు. బిసి, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు, ఆదివాసీ గిరిజనులకు రూ.లక్ష చొప్పున అదనంగా గ్రాంట్ చేసేందుకు కూడా ప్రభుత్వం ముందుకు వచ్చింది. నిధులు మొత్తం పెరిగిన నేపథ్యంలో లబ్ధిదారులు ఎవరైనా సొంతంగా కట్టుకోవాలని భావిస్తే ఆ రకమైన సదుపాయం కూడా అవకాశం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం.

-జి.మురళీ మోహన్, గృహ నిర్మాణ శాఖ పీడీ

32 బాలల సంరక్షణ కేంద్రాలకు ప్రతిపాదనలు

మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 32 బాలల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. వీటిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో 5, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో 27 ఏర్పాటు చేసుకొనేందుకు ప్రభుత్వానికి దరఖాస్తులు అందాయి. జువైనల్ జస్టిస్ యాక్ట్-2015 ప్రకారం వీటిని ఏర్పాటు చేసేందుకు డిపిఒ కన్వీనర్ గా ఉన్న పర్యవేక్షణ కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సులను కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ మంగళవారం పరిశీలించింది. నిబంధనల ప్రకారం అన్నీ సరిగ్గా ఉన్నాయో, లేదోనని అక్కడక్కడా తనిఖీ చేసి, నివేదిక ఇవ్వాలని జిల్లా కమిటీ సభ్యులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆమోదిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బాలల సంరక్షణ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ జి.హిమబిందు, ఎఎస్‌పి సౌమ్యలత, ఐసిడిఎస్ పీడీ రుక్సానా బేగం, డిసిపియు లక్ష్మి, కమిటీ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం జోనల్ ప్రధాన కార్యదర్శిగా చిరంజీవి

ప్రజాశక్తి-విజయనగరం



సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశం మంగళవారం విశాఖపట్నంలో జరిగింది. ఈ సమావేశంలో జోనల్ ప్రధాన కార్యదర్శిగా గెద్ద చిరంజీవిరావును ఎన్నికున్నారు. సమావేశంలో సంఘం జోనల్ న్యాయ సలహాదారులు కెపి దేశాయ్, జోనల్ గౌరవ అధ్యక్షులు మమ్మల తిరుపతిరావు, జోనల్ వ్యవస్థాపక అధ్యక్షులు, నూతన అధ్యక్షులు జంగం జోషి, ఆరు జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంకిలి ఫ్యాక్టరీని కాపాడుకుందాం

చెరకు రైతుల సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

ప్రజాశక్తి-రేగిడి

సంకిలి ఇఐడి ప్యారీ చక్కెర ఫ్యాక్టరీని సంఘటితంగా కాపాడుకుందామని చెరకు రైతుల సమావేశంలో తీర్మానించారు. మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద చెరకు రైతు ప్రతినిధి కింజరాపు సురేష్ అధ్యక్షతన మంగళవారం చెరకు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మాట్లాడుతూ చక్కెర ఫ్యాక్టరీ యాజమాన్యం ఇటీవల చేపడుతున్న చర్యలతో కర్మాగారం మూసివేత దిశగా వెళ్తుందనే అపోహలు చెరుకు రైతుల్లో కలుగుతున్నాయని తెలిపారు. చెరుకు రైతుల అనుమానాన్ని యాజమాన్యం నివృత్తి చేయాలని కోరారు. చెరకు సాగు విస్తీర్ణం పెంచే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించాలన్నారు. చెరకు రైతులకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలే రాజేష్ మాట్లాడుతూ తమిళనాడులో చెరకు కటింగ్ నిమిత్తం రైతులకు ఒక్కో టన్నుకు రూ.350ను ఆ ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. అక్కడి మాదిరిగా మన రాష్ట్రంలోనూ చెరకు రైతులను ప్రోత్సహిస్తే చెరుకు సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. వైస్ ఎంపిపిలు అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్రావు, రైతు సంఘం నాయకులు అప్పలనాయుడు, నారు జనార్దనరావు మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ సుగర్ ఫ్యాక్టరీని మూసివేయొద్దని, చెరకు సాగు విస్తరించి, రైతులకు అవగాహన కల్పించే బాధ్యత యాజమాన్యంపై ఉందని స్పష్టంచేశారు. చెరకు ఫ్యాక్టరీకి స్థానిక రైతులు భూములు ఇచ్చారని గుర్తుచేశారు. చెరకు ఫ్యాక్టరీ వల్ల ఎంతోమంది రైతులు, కూలీలు, వ్యాపారులు జీవిస్తున్నారని, అందుకు ఈ కర్మాగారాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపైనా ఉందని వెల్లడించారు. ఈ సందర్భంగా చెరకు రైతుల జెఎసిని ఏర్పాటు చేసి యాజమాన్యంతో చర్చలు నిర్వహించి, అందరం కలిసి చెరుకు ఉత్పత్తిని పెంచేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కె.శ్రీనివాసరావు, రాజగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కణపాకలో ఉన్న యూత్ హాస్టల్లో మాతృభూమి సేవాసంఘం, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. తెలుగుంటి సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆయన 75వ సారి రక్తదానం చేశారు. ఆయనను చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షులు సిరి సహస్ర అభినందించారు. కార్యక్రమంలో లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జి, నిర్వాహకులు ఐ.గోపాలరావు, టి.నాగేశ్వరావు, పి. సుధాకర్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. నగరంలోని కొత్తపేట నీళ్లట్యాంకు, దాసన్నపేట రైతు బజార్, కలెక్టరేట్ కూడలి, కార్పొరేషన్ కార్యాలయం, మయూరి జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, ఎన్‌సిఎస్ గాంధీ జంక్షన్, కోట జంక్షన్ వంటి పది ప్రాంతాలలో చలివేంద్ర కేంద్రాలను ఏర్పాటు చేశారు. చలివేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ పల్లి నల్లనయ్య కోరారు.

ఆశాలకు భద్రత కల్పించండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్‌మోహన్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. మంగళవారం స్థానిక గాజులరేగ అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ సర్వేలు, యాప్‌ల ద్వారా ఆశావర్కర్లతో 24 గంటలు పనిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పని భారంతో మానసికంగా ఇబ్బంది పడుతుంటే, మరో వైపు ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న వారు సర్వేకు వెళ్లిన ఆశా వర్కర్లపై దురుసుగా మాట్లాడటం, దాడులకు దిగటం చేస్తున్నారని తెలిపారు. అటువంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వ సర్వేలపై ప్రజలకు ముందుగా అవగాహన కల్పించాలన్నారు. మార్చి నెల వేతనం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.

రేపటి నుంచి వేసవి బూట్ క్యాంప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మే నెల ఒకటో తేది నుంచి మూడు రోజులపాటు ఎటిఎల్ సమ్మర్ బూట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు డిఇఒ మాణిక్యంనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎటిఎల్ సమ్మర్ బూట్ క్యాంప్ వాల్‌పోస్టర్‌ను మంగళవారం డిఇఒ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో అధునాతన సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించే లక్ష్యంతో సమ్మర్ బూట్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో జామి, కుమరాం, ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలతోపాటు శృంగవరపుకోట మండలంలోని వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. క్యాంపులో విద్యార్థులకు డిజైనింగ్, క్రిటికల్ థింకింగ్, డ్రోన్ టెక్నాలజీ, 3డి ప్రింటింగ్ టెక్నాలజీ, ఆర్డినో కోడింగ్, రోబోటిక్ ఆటోమేషన్ టెక్నాలజీలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ కె.వెంకటరమణ , జిల్లా సైన్స్ అధికారి టి.రాజేష్, హబ్ ఎటిఎల్ ఇన్‌ఛార్జి వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సంతాన సాఫల్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం

మహేంద్ర హాస్పిటల్స్, ఐశ్వర్య ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యాన మంగళవారం మెగా ఉచిత సంతాన సాఫల్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ ప్రశాంతి బెవర, ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్టు స్వాతి.. 45 జంటలకు పరీక్షలు చేసి, కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రస్తుతం యువతలో ఇన్ఫెక్టిలిటీకి గల కారణాలను వారు వివరించారు. స్త్రీలలో లేట్ మ్యారేజస్ వల్ల ఒబిసిటీ, ఆహారపు అలవాట్ల వల్ల ప్రస్తుతం కాలంలో ఎక్కువగా సంతాన సమస్యలు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. పురుషులలో స్మోకింగ్, ఆల్కహాల్ తీసుకున్న వారిలో సంతాన సమస్యలు ఎక్కువగా ఉన్నట్టు తెలియజేశారు. శిబిరంలో మహేంద్ర హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బి.మహేంద్ర గిరి, ఎఒ నాయుడు, తదితరులు పాల్గొన్నారు

పోలీసుస్టేషన్‌లో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి- జామి

జామి పోలీసు స్టేషన్‌ను ఎస్‌పి వకుల్ జిందాల్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని వివిధ రికార్డులు, సీడీ ఫైళ్లను తనిఖీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెట్టాలని, ఉక్కుపాదం మోపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. నేరాల నియంత్రణ, ఛేదనలో సీసీ కెమెరాలు ముఖ్య భూమిక పోషిస్తున్నాయన్నారు. నేర నియంత్రణలో భాగంగా పోలీసు స్టేషన్ పరిధిలో సాధ్యమైనన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట విజయనగరం డిఎస్‌పి ఎం. శ్రీనివాసరావు, ఎస్‌కోట సిఐ ఎల్. అప్పలనాయుడు, ఎస్‌బి సిఐ ఎవి లీలారావు, జామి ఎస్ఐ వై. వీరజనార్దన్ తదితరులున్నారు.

కృష్ణంనాయుడికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని అంబఖండికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు పుల్లి గోపాల కృష్ణంనాయుడు తెలుగు, వెలుగు ఉగాది మహోన్నత జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు మంగళవారం తెలిపారు. తెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మే1న పౌర గ్రంథాలయం విశాఖపట్నంలో ఈ అవార్డు అందుకోనున్నారు. ఆయన విద్య, సాంస్కృతిక సేవా రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు అవార్డు వచ్చినట్లు తెలిపారు. ఈయనకు రావడం పట్ల విద్యాశాఖ అభినందనలు తెలిపింది.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగుతున్నందున బుధవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాథరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సతివాడ 33/11కెవి సబ్‌స్టేషన్ పరిధిలో రామతీర్థం 11 కెవి రూరల్ ఫీడర్, ఒమ్మి 11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో వ్యవసాయ కనెక్షన్ నిర్వాహణపనులు కొనసాగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం మధుపాడ, పినతలిమి,పెద తలిమి, బొప్పడం, వల్లూరు, బుచ్చన్నపేట, ఒమ్మి, మాల్యాడ, వెంకన్నపాలెం, గ్రామాలకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆ పింఛన్లకు రీవెరిఫికేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో మానసిక వికలాంగ పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు జిల్లా కేంద్రంలో నిర్వహించే రీ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని ఎంపిడిఒ రత్నం తెలిపారు. ఈ పింఛన్లు పొందుతున్న 120 మంది మానసిక వికలాంగులకు సదరం ధ్రువపత్రాలను పునఃమూల్యాంకన షెడ్యూల్‌ను డిఆర్‌డిఎ విడుదల చేసిందన్నారు. సదరు పింఛనుదారులు మే 9, 14వ తేదీలలో జి.జి.హెచ్ విజయనగరంలో హాజరు కావాలన్నారు. మే 9న ఆరికతోట, బూసాయవలస, దుప్పలపూడి, గొల్లపేట సచివాలయాల పరిధిలో ఉన్నవారు, మే14న మిగిలిన సచివాలయాల పరిధిలో ఉన్న లబ్ధిదారులు హాజరు కావాలన్నారు. ఆయా పరిధిలోని సచివాలయాల సిబ్బంది లబ్ధిదారులకు సమాచారాన్ని చేరవేసి విజయవంతం చేయాలన్నారు.

చెత్త సంపద కేంద్రం వద్ద జంగిల్స్ తొలగింపు

ప్రజాశక్తి - వేపాడ

వేపాడ సచివాలయం పరిధిలో గల చెత్త సంపద కేంద్ర వద్ద ఉన్న జంగిల్స్‌ను, చెత్తను మంగళవారం సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమాన్ని ఇఒపిఆర్‌డి రవికుమార్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్జునమ్మ, రమణ, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ జి.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీను, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పండ్ల మొక్కల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం సిఎస్‌ఎ ఆఫీసులో సుస్థిర వ్యవసాయ కేంద్రంలో పండ్ల మొక్కల పెంపకం పై, ప్రకృతి వ్యవసాయ యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సుస్థిర వ్యవసాయ కేంద్రం ఆధ్వర్యంలో మొక్కలు తీసుకున్న రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మొక్కలు ఎంపిక, నాటే విధానం, కొమ్మ కత్తిరింపులు గురించి హార్టికల్చర్ ఎఇఒ అప్పారావు వివరించారు. పురుగు తెగుళ్ల నివారణ, మొక్కల పెరుగుదలకు పాటించవలసిన సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ పి. వెంకటరావు వివరించారు. నివారణకు ట్రైకోడెర్మా, సుడోమోనాస్ కల్చర్ వాడడం ఆకు ముడత, దోమకు వేప నూనె, కానుగ నూనె స్ప్రే చేయాలని చెప్పారు. మొక్కలలో భూ సారాన్ని పెంచడానికి అంతర పంటగా నవ ధాన్యాలు వేయాలాని ఆర్‌వైఎస్‌ఎస్ ఆర్‌టిఎల్ ప్రకాష్ వివరించారు. అనంతరం వీటికి అవసరమైన ఇన్‌పుట్స్‌ను రైతులకు పంపిణీచ చేశారు. ఈ కార్యక్రమంలో బొద్దాం రైతు సేవా కేంద్రం ఎఇఒ రమేష్, సబల్ ప్రాజెక్ట్ టీమ్,సే ట్రీస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ రాంబాబు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై దర్యాప్తు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని అరిగిపాలెంలో ఏ విధమైన అనుమతులూ లేకుండా చెరువుల్లో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామానికి చెందిన ఎన్.రామలక్ష్మి తహశీల్దార్ జె. రాముమమ్మకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనికి స్పందించిన తహశీల్దార్ వెంటనే క్షేత్ర స్థాయిలో దర్యాప్తు జరిపి నివేదిక తనకు అందజేయాలని ఎంఆర్‌ఐ రామలక్ష్మి, విఆర్‌ఒ సత్యవతికి ఆదేశించారు.

807 కేజీల గంజాయి ధ్వంసానికి అనుమతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఎస్‌కోట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 807 కేజీల గంజాయి ధ్వంసం చేయడానికి అనుమతి లభించిందని సిఐ సిహెచ్ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో నాలుగు గంజాయి కేసులలో సీజ్ చేసిన 807 కేజీలు గంజాయిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావ్, విజయనగరం డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు తదితరులు స్టేషన్ ఉన్న గంజాయిని తనిఖీ చేసి ధ్రువీకరించి ఈ ధ్వంసం చేయడానికి తనకు అనుమతులు ఇచ్చారని సీఐ తెలిపారు. గంజాయి రవాణా, నాటు సారా తయారీ, అమ్మకాలు, మద్యం బెల్ట్ దుకాణాలు ద్వారా అమ్మకం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారని ఆయన తెలిపారు.

వేసవి విజ్ఞాన తరగతుల్లో పిల్లలకు డ్రాయింగ్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులలో భాగంగా పిల్లలకు మంగళవారం డ్రాయింగ్ నేర్పించామని, క్యారం బోర్డ్, చదరంగం ఇతర ఆటలు ఆడుకోవడానికి ఏర్పాట్లు చేశామని శాఖ గ్రంథాలయ అధికారి దామోదర శ్రీధర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి ప్రణాళిక

ప్రజాశక్తి - వంగర

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్‌ఆర్‌కెవిఎం) కిట్లు పంపిణీకి ప్రణాళిక రూపొందించాలని ఎంఇఒలు పి.ప్రవీణ్ కుమార్, కె.జగదీశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్ఆర్‌కెవిఎం పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థికీ పాఠ్యపుస్తకాలు, వర్క్ బుక్‌లు, నోట్ పుస్తకాలు, గ్రాఫ్ బుక్‌లు, యూనిఫామ్‌లు, షూస్, సాక్స్‌లు, బెల్టులు, బ్యాగులు, వంటి వస్తువులతో కూడిన కిట్లు అందించాలన్నారు. మండలానికి వచ్చిన కిట్లు ప్రతి పాఠశాలకు సక్రమంగా పంపిణీ జరిగేటట్లు సిబ్బంది సరైన ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కొప్పర హెచ్‌ఎం సత్యనారాయణ, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది కిరణ్ కుమార్, ఎంట్రీ తవిటి నాయుడు, సిఆర్‌ఎంటిలు గణపతి, వాసు, అనురాధ, ప్రేమ్ కుమార్, శ్రీను, సాంబశివరావు, పోలినాయుడు, విజయ, పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని కొర్లవలస ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న ఈసర్ల రామారావు(58) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని వాండ్రంగి గ్రామంలో తన స్వగృహంలో ఉదయం గుండెపోటుతో మరణించారు. అంకితభావంతో పనిచేసే వ్యక్తిగా పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. ఈయన మృతికి ఎంఇఒలు వరప్రసాదరావు, ఎరకయ్యతోపాటు ఉపాధ్యాయ సంఘాలు సంతాపం వ్యక్తం చేసి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆటాడుకుందాం..రా

- మే 1 నుంచి వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు
- శిబిరానికి రూ.7 వేలు చొప్పున కేటాయింపు
- 50 చోట్ల శిక్షణకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు పచ్చ జెండా ఊపింది. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు ప్రభుత్వం ఏటా వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తోంది. ఈ ఏడాది వేసవి శిక్షణ శిబిరాలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలో వీటిని నిర్వహించేందుకు జిల్లా క్రీడాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఏడాదంతా పుస్తకాలు, ప్రాజెక్టులు, పరీక్షలు అంటూ ఒత్తిడిలో ఉన్న విద్యార్థులు పరీక్షలు ముగిసిన తరువాత వేసవి సెలవుల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో గడపాలని అనుకుంటారు. సెల్‌ఫోన్ల యుగంలో విద్యార్థుల దృష్టిని మళ్లించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు శాప్ ఆధ్వర్యంలో ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. మే 1 నుంచి 31 వరకు జిల్లాలోని 50 నిర్ణీత ప్రాంతాల్లో ఈ శిబిరాలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగ రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే శిక్షకులు నియమానికి దరఖాస్తులు ఆహ్వానించింది. ఒక్కో శిబిరానికి రూ. 7వేలు చొప్పున ప్రభుత్వం కేటాయించింది. ఈ మొత్తంలో శిక్షకుడికి రూ. 2వేలు, మిగిలిన రూ. 5వేలు క్రీడా సామగ్రి, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించనున్నారు.



శిక్షణకు సిద్ధమవుతున్న విద్యార్థులు

నెలరోజుల పాటు నిర్వహణ

జిల్లాలో ఔత్సాహికులైన బాల బాలికలకు నెల రోజులపాటు పలు ఆటల్లో శిక్షణ ఇవ్వాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిర్ణయించింది. ఇందుకోసం శిక్షకులను ఎంపిక చేసింది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ నిర్వహిస్తారు. వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండే విద్యార్థులు వారికి ఇష్టమైన ఆటలు ఆడి నెల రోజులపాటు నైపుణ్యం సాధించ వచ్చు.

వివిధ అంశాల్లో తర్ఫీదు

ఓ వైపు చదువుతో పాటు మరో వైపు క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఏటా వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుంటారు. ఇందులో 8 ఏళ్ల నుంచి 16 సంవత్సరాలలోపు వయస్సు గల బాల, బాలికలకు అవకాశం కల్పిస్తారు. విద్యార్థులు వారికి ఇష్టమైన క్రీడా రంగంలో శిక్షణ పొందేందుకు ఇదో సువర్ణావకాశం. అర్చరీ, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, షటిల్ బ్యాడ్మింటన్, ఫుట్బాల్, ఫెన్సింగ్, హ్యాండ్బాల్, ఖోఖో, కబడ్డీ, కరాటే, సాఫ్టబాల్, తైక్వాండో, వాలీబాల్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఏఏ ప్రాంతాల్లో.. ఏ క్రీడాంశంలో శిక్షణ ఇస్తారనేది జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ప్రకటించింది. దీని కోసం ఒక యాప్‌ను కూడా ప్రవేశ పెట్టారు. శిబిరాలకు వెళ్ల వలిసిన క్రీడాకారులు ఆ యాప్‌లో సమగ్ర వివరాలు నమోదు చేసుకోవాలి.



ఎస్.వెంకటేశ్వరావు,

50 శిబిరాలు నిర్వహణ

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల నేపథ్యంలో జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధం చేశాం. జిల్లా మొత్తంగా 50 శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఈ మేరకు క్రీడాసంఘాలు, వ్యాయామ ఉపాధ్యాయల నుంచి దరఖాస్తులు ఆహ్వానించాం. ఎంపిక చేసిన ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహిస్తాం. ఒక్కో శిబిరానికి రూ. 7వేలు మంజూరు కానుంది. శిక్షణ శిబిరాల్లో అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నాం. వేసవి శిక్షణ శిబిరాలను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలి

ఎస్.వెంకటేశ్వరావు, డిఎస్‌డిఒ, విజయనగరం

శిక్షణ శిబిరాలు ఇవే

ఆర్చరీ: రామనారాయణం, విజయనగరం
అథ్లెటిక్స్: విజ్జీ స్టేడియం విజయనగరం, చింతపల్లిలో 2 శిబిరాలు, శ్యామ్‌పురం(రాజాం), బొండపల్లి.
బాల్ బ్యాడ్మింటన్: నెమలామ్, మెరకముడిదాం జెడ్‌పి హైస్కూల్.
బాస్కెట్‌బాల్: విజ్జీ స్టేడియం విజయనగరం
బాక్సింగ్: సవరవిల్లి, నెల్లిమర్ల, దుప్పాడ, ద్వారపూడి, విజయనగరం రాజీవ్ మైదానం, బిపిఎం స్కూల్.
బాడ్మింటన్: ధర్మవరం, బొబ్బిలి, రాజాం.
ఫుట్బాల్: నెల్లిమర్ల, విజ్జీ స్టేడియం, ఎమ్మార్, రాజీవ్ మైదానం విజయనగరం.
ఫెన్సింగ్: కస్పా స్కూల్ విజయనగరం
హ్యాండ్బాల్: డెంకాడ, అక్కివరం, కొనూరు.
ఖో ఖో: కస్పా, పూల్బాగ్ హై స్కూల్, గరివిడి, పెదవేమలి
కబడ్డీ: రెల్లివలస, సారిపల్లి, బాలికలు హై స్కూల్ విజయనగరం, గరివిడి, వల్లాపురం.
కరాటే: విజయనగరం పాల్ నగర్, పిఎస్ఆర్ కాలనీ.
సాఫ్ట్‌బాల్: తూడేమ్, పారాధి జెడ్ హై స్కూళ్ళు.
తైక్వాండో: విజయనగరంలో కస్పా, థెరిస్సా క్లబ్, బొబ్బిలి శ్వేత చలపతి, సంస్థానం స్కూలు.
వాలీబాల్: కొత్తవలస, ఏవీపురం, గరివిడిలో రెండు, భోగాపురం, పెదమజ్జి పాలెం.
రెజ్లింగ్: కొండ వెలగాడ

కొనసాగిన మారిక గిరిజనుల నిరసన

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మారిక గిరిజనులు రెండవ రోజు మంగళవారం వంటావార్పుతో పాటు నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. సిపిఎం నాయకుడు చల్ల జగన్ మాట్లాడుతూ జిల్లా అధికారులు వచ్చే వరకూ తహశీల్దార్ కార్యాలయం విడిచి పెట్టేది లేదన్నారు. అదానీ నిర్మించబోతున్న పవర్ ప్లాంట్‌కు తమ భూములు ఇచ్చేది లేదని అవసరమైతే తమ ప్రాణాలు విడిచిపెడతామని హెచ్చరించారు. గిరిజనులను మోసం చేసిన ఏ ప్రభుత్వాలు మనుగడ సాగించలేవని చెప్పారు. నిరసన కార్యక్రమం వద్ద ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా సిఐ అప్పలనాయుడు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, గ్రామ సర్పంచు పాత బోయిన పెంటమ్మ, వీర్రాజు, బాబురావు, ఆనంద్ గణేష్, గిరిజన మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

నిరసనకు తాత్కాలిక విరామం

మారిక కొండలను అదానీకి కేటాయిస్తున్న విషయాన్ని ఆ గ్రామ గిరిజనులు వ్యతిరేకించి నిరసన కార్యక్రమాన్ని చేపడుతుండటంతో తహశీల్దార్ జె.రాములమ్మ స్పందించారు. తాము కొండలపై సర్వేకు రామని, తమ వల్ల గిరిజనులకు ఎటువంటి ఇబ్బందీ ఉండదని హామీ ఇచ్చారు. దీంతో గిరిజనులు నిరసన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించి అక్కడి నుంచి వెనుదిరిగారు

షాపుల తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి - కొత్తవలస

కొత్తవలస మేజర్ పంచాయతీ శ్మశాన వాటికి ఆనుకొని ఉన్న షాపులను తొలగింపునకు చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి తెలిపారు. కొత్తవలస మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం మంగళవారం ఆయన అధ్యక్షతన, పంచాయతీ ఇఒ శైలజ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ రామస్వామి మాట్లాడుతూ శ్మశాన వాటికి వద్ద అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు నోటీసులు ఇచ్చి తీసివేస్తున్నామన్నారు. కొంతమంది నాయకులకు డబ్బులు ఇచ్చామంటూ షాపు యజమానులు ఆరోపిస్తున్నారని చెప్పారు. ఆటో స్టాండ్ వద్ద అన్నా క్యాంటీన్‌కు స్థలం కేటాయించాలని, శ్మశాన వాటిక వద్ద షాపులను తొలగించి ఆటో స్టాండ్‌కు కేటాయిస్తామని సభలో ప్రస్తావించారు. మాజీ సర్పంచ్ గొరపల్లి రాము పంచాయతీ సమస్యలపై సభలో ప్రస్తావించారు. ముందుగా పంచాయతీలో నగదు ఎంత ఉంది, ఏ నగదు ఏవిధంగా ఖర్చు చేశారని, ఇంటి పన్ను ఏమాత్రం వసూలు చేశారని ప్రశ్నించారు. పంపు ఆపరేటర్లు ఎంతమంది ఉన్నారని, తదితర ప్రశ్నలు అడగగా మేజర్ పంచాయతీ సర్పంచ్ సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్క ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. కొత్తవలసలో ప్రతి ఒక్క నాయకుడికి కలెక్షన్ ఏజెంట్లు ఉన్నారంటూ రాము ఆరోపించారు. శ్మశాన వాటికి వద్ద డబ్బులు ఇచ్చారన్న మాట వాస్తవమైతే వాళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ రామస్వామి

గ్రామాల్లో కమిటీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- గంట్యాడ

గ్రామాల్లో కమిటీలను ఏర్పాటు చేసి కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని ఐసిడిఎస్ పిఒ ఉమా భారతి అన్నారు. మంగళవారం మండలంలోని పెదమజ్జిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో కిషోర బాలికల సమ్మర్ క్లాసులపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాలలో 11 సంవత్సరాలు నుంచి 14 సంవత్సరాలు, 15 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల పిల్లలను రెండు గ్రూపు లుగా తయారు చేసి వారంలో రెండు రోజులు ఒక్కొక్క గ్రూప్‌కి ఒక్కొక్క కార్యక్రమం గురించి అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలలో కమిటీలను ఏర్పాటు చేసి కమిటీల ద్వారా శిక్షణ అందించాలన్నారు. వేసవి కాలంలో పిల్లలలోని వచ్చే మార్పులు ఎదుగుదల రక్తహీనత విద్య పైన అన్ని విషయాలు పైన అవగాహన కల్పించాలని, దీనిపైన రాష్ట్రం మొత్తం మీద యాక్షన్ ప్లాన్ చేసి దీని గురించి జిల్లా లెవెల్లో సిబ్బందికి శిక్షణ ఇచ్చారన్నారు. ఆరోగ్య శాఖ నుంచి ఐదుగురు సభ్యులు, ఎంఎస్‌కె కన్వీనర్, అంగనవాడి కార్యకర్త, ఆశ వర్కర్, ఏఎన్ఎం, విఒఎ ప్రెసిడెంట్లును కమిటీలుగా ఏర్పాటు చేసి వీరి ద్వారా శిక్షణను ఇస్తామన్నారు. ప్రతి గ్రామంలోని టైం టేబుల్ ప్రకారం కిషోర్ బాలికలకు అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పెదమజ్జి పాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.పల్లవి, సెక్టర్ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: మాట్లాడుతున్న సిడిపిఒ ఉమా భారతి

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి హెచ్చరించారు. ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం కిశోర్ వికాశ్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలకు వివాహాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతీ నెల 3వ శుక్రవారం వీటిపై గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని సూచించారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు రాకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. బాల బాలికలకు సమ్మర్ క్లాసులపై షెడ్యూల్ విడుదల చేశారు. వీటిలో ఎంఎస్‌పి, ఎఎన్ఎం, విఒఎలు క్లాసులు తీసుకోవాలని సూచించారు. కౌమార బాలికల నాయకత్వం, సాధికారిత, సైబర్ భద్రత, శారీరక వ్యాయామం, లింగ అసమానత, ఆర్థిక నిర్వహణ, విద్యా, కెరీర్ మార్గ దర్శకత్వం, నైపుణ్యాల ప్రాముఖ్యతపై బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రత్నం, హెల్త్ పీహెచ్ఎన్ పద్మలత పాల్గొన్నారు.

జెసి రాజుకు ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం



బొబ్బిలి: ప్రముఖ సామాజిక సేవకులు కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్, రోటరీ జిల్లా చైర్మన్ జెసి రాజుకు ప్రతిష్టాత్మక ఎన్‌టిఆర్ స్మారక పురస్కారానికి ఎంపికైనట్లు ఆయన మంగళవారం తెలిపారు. 60 ఏళ్లుగా రాష్ట్ర వ్యాపంగా సేవలు అందిస్తున్న విజయవాడకు చెందిన ప్రముఖ సేవా సంస్థ, ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ ఈ పురస్కారాన్ని ప్రకటించినట్లు, అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను పంపించినట్లు జెసి రాజు తెలిపారు. ఎన్‌టిఆర్ స్మారక పురస్కారం విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రంలో మే 31 శనివారం నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు జయంతి సభలో ప్రముఖల చేతుల మీదుగా అవార్డును అందుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ అధ్యక్ష, కార్యదర్సులు సింద్రీ శ్రీనివాసన్, ప్రవీణ్ కుమార్‌తో పాటు రోటరీ సభ్యులు కారుణ్య ఫౌండేషన్ చీఫ్ ఆర్గనైజర్ డేవిడ్ జె విక్టర్, ట్రస్టీ పివిఎ మెర్సీ రాజ్ అభినందనలు తెలిపారు.

కార్మికులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి - రామభద్రపురం

లేబర్ కోడ్ చట్టాల మార్పుతో కార్మికులకు ప్రధాని మోడీ తీవ్ర అన్యాయం చేస్తున్నారని సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆరికతోట అంగన్వాడీ సెక్టార్ వద్ద ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం కార్మికుల పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మార్చివేసి కేవలం 4 లేబర్ కోడ్ చట్టాలను అమలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ నూతన చట్టాలతో కనీస వేతనాలు, సమ్మె చేసే హక్కు కోల్పోతారన్నారు. నూతన చట్టాలను రద్దుచేసి పాత చట్టాలను అమలు చేయాలని కోరుతూ మే 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్లు సత్యవతి, కలావతి, శాంత కుమారి, రమణి పాల్గొన్నారు.



సమ్మె పత్రాన్ని విడుదల చేస్తున్న అంగన్‌వాడీలు

మేడేను జయప్రదం చేయాలి

నెల్లిమర్ల: ప్రపంచ కార్మిక దినం మేడేను జయప్రదం చేయాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. మంగళవారం ఆయన మేడేను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద మూడు షిఫ్ట్‌లకు మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కార్మికులు 8గంటల పని సమయం, హక్కులు సాధించడానికి చికాగో నగరంలో కార్మికులు ఉద్యమించి ప్రాణ త్యాగం చేశారని వారిని గుర్తించికొంటూ మేడే జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. కార్మిక వర్గం ప్రస్తుత పాలకుల నుంచి రక్షించుకోవడానికి మేడేను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కలరాయడమే కాకుండా పెట్టు బడిదార్లకు ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయన్నారు. లేబర్ కోడ్లు రద్దు చేయాలని మే 20న దేశావ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం వాయిదా

టిడిపి, వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. మంగళవారం స్థానిక నగర పంచాయతీలో కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉంది. అయితే కేవలం జనసేన, బిజెపి ఇద్దరు కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కావడం, చైర్‌పర్సన్ బంగారు సరోజినీ కూడా తన బంధువు చనిపోవడంతో ఆమె కూడా హాజరు కాలేదు. టిడిపి, వైసిపి కౌన్సిలర్లు కూడా సమావేశానికి హాజరు కాక పోవడంతో కౌన్సిల్ సమావేశం వాయిదా పడింది. కాగా కౌన్సిల్ సమావేశానికి వెళ్ళవద్దని వైసిపి అధిష్టానం ఆదేశించినట్లు సమాచారం. టిడిపి కౌన్సిలర్లు కూడా సమావేశానికి హాజరు కాకపోవడం వైసిపి, టిడిపి కొత్త కూటమి కట్టినట్లు నగర పంచాయతీలో చర్చ జరుగుతుంది. దీంతో టిడిపి, వైసిపి కౌన్సిలర్లు సమావేశానికి హాజరు కాకపోవడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.




సమావేశానికి హాజరైన ఇద్దరు కౌన్సిలర్లు

'పూలే' పేరు విస్మరించడం సరికాదు

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ప్రముఖులు, మహనీయులు జయంతి, వర్ధంతుల జాబితాలో భారతదేశ మొదటి ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘసంస్కర్త సావిత్రిభాయి పూలే పేరును తొలగించడం సరికాదని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి అన్నారు. మంగళవారం వాసు కళాశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశంలో ఆడపిల్లల చదువు కోసం బ్రిటీష్ వారితో పోరాడి, ఆమే స్వయంగా 58 పాఠశాలలను నెలకొల్పి బాలికా విద్యకు బాటలు వేసిన మహనీయురాలని, అటువంటి వ్యక్తి జయంతులు, వర్ధంతులను చరిత్రలను విస్మరించడం చాలా బాధాకరమని అన్నారు. సామాజిక ఉద్యమాలను ప్రోత్సహించి, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చైతన్యం నింపిన ఆమె జయంతి జనవరి 3, వర్ధంతి మార్చి 10ని ప్రముఖుల జాబితాలో చేర్చాలని, దేశం గర్వించదగ్గ మహాకవి గురజాడ జాతిని మేల్కొలిపిన దేశమును ప్రేమించుమన్నా.. మంచియన్నది పెంచుమన్నా ఖండాంతరాలలో మార్మోగుతున్న గేయాన్ని రాసిన గురజాడ జయంతిని ప్రముఖుల జాబితాలో విస్మరించడం మరింత బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో సావిత్రి భాయి పూలే, గురజాడ అప్పారావు జయంతులను, వర్ధంతులను చేర్చాలని మహిళా టీచర్ల ఫోరంగా, యుటిఎఫ్‌గా కోరుతున్నామన్నారు.



మాట్లాడుతున్న విజయగౌరి

కలుషితం నుంచి కాపాడాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చంపావతి నదిని కలుషితం నుంచి కాపాడాలని 7వ వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ కమిషనర్‌ని కోరారు. మంగళవారం ఆయన వార్డు పర్యటకు వచ్చిన కమిషనర్‌ను కలిసి చంపావతి నది కలుషితంపై వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ మాట్లాడుతూ స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి చంపావతి నదిలో కోళ్ల ఫారం, చికెన్ షాప్‌లలో కోళ్ల వ్యర్థాలు, పేగులు, వేస్ట్, బార్బర్ షాపులో కట్ చేసిన వేస్టు (వెంట్రుకలు) అంత నదిలో వేస్తున్నారన్నారు. దీనివల్ల నగర పంచాయతీకి, విజయనగరానికి సరఫరా అయ్యే మంచినీరు కలుషిత అవుతుందని, రాబోయే రోజుల్లో డయేరియా, మలేరియా, కలరా వంటి అంటు వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని, తక్షణమే చర్యలు తీసుకుని చికెన్ షాపులు, కోళ్ల ఫారాలు, మంగళ షాపుల యజమానులను హెచ్చరించాలని కోరారు. 7వ వార్డులో గత కొన్నేళ్లుగా విద్యుత్ స్తంబాలు శిథిలావస్థకు చేరడం వల్ల వీధి లైట్లు సరిగా వెలగడం లేదని, సిసి రోడ్ల కోసం తవ్వకాలు జరిపి వదిలేశారని, వీధి కుళాయిలు కూడా పాడై సక్రమంగా నీటి సరఫరా జరగడం లేదని ఆ సమస్యలు పరిష్కరించాలని కోరారు.



నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతాని కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాదికారి మాణిక్యంనాయుడు అన్నారు. మండలంలోని లెక్కిడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన ప్రభుత్వ విద్యార్థుల విజయభేరి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా శతశాతం సాధించడానికి ఉపాధ్యాయుల సమిష్టిగా పని చేయటం వల్ల విజయం సాధించారన్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. మనం మంచిగా ఉన్నప్పుడే మన పిల్లలు మంచి ప్రవర్తన అనుసరిస్తూ ఎదుగుతారని చెప్పారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ఎంతో శ్రద్ధ వహించి ఎన్నో సంస్కరణలు చేపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించడానికి ప్రయాస పడకుండా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదివించి పిల్లలు ఎదుగుదలకు తోడ్పడాలని అన్నారు. 24 మందిలో 568 గరిష్ట మార్కులతో పాటు ఏడుగురికి 500 పైబడి మార్కులు రావడం సంతోషకరమన్నారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెడల్స్ వేసి మెమోంటోలను అందించారు. తల్లిదండ్రులను సాలువులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువజన సంఘం అధ్యక్షులు వాసిరెడ్డి పవన్ కుమార్, ఎస్ఎంసి చైర్మన్ వాసిరెడ్డి రామచంద్రమ్మ, లచ్చిరెడ్డి కృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.